# ముక్తి మార్గం



బ్రహ్మర్షి పత్రీజీ

# " ముక్తి మార్గం ! "

**ముక్తి**; **మార్గం** అనే పదాలలో ' ఆధ్యాత్మికత ' అంతా ఉంది మరి !

మొదటి పదం **ముక్తి** అనే పదం !

రెండవది " మార్గం " అనే పదం !

**మార్గం** అంటే అందరికీ తెలుసు. కానీ,

**ముక్తి** అంటేనే అది ఏమిటో ఎవ్వరికీ తెలియదు !

మొట్టమొదటగా **ముక్తి** అంటే ఏమిటో తెలుసుకుందాం !

తరువాత అది సాధించడానికి " మార్గం " గురించి తెలుసుకుందాం !

అప్పుడు ఆ " మార్గం " లో పయనిస్తే మనం " ముక్తి " పొందుతాం !

" ముక్తి " అన్నా, " మోక్షం " అన్నా, " నిఃశ్రేయస్సు " అన్నా, "అపవర్గం " అన్నా " సాల్వేషన్ " అన్నా... ఇవన్నీ కూడానూ ఒకే ఒక పదానికి పర్యాయపదాలు !

## " ముక్తి అంటే విడుదల ! "

దేని నుంచి విడుదల ?? దుఃఖం నుంచి విడుదల !!! మనిషి ఎల్లప్పడూ " ఆనందంగా " జీవించాలి; అంటే మనిషి యొక్క శరీరం ఎప్పడూ, ఎల్లప్పడూ ఆరోగ్యకరంగా, తేజోవంతంగా ఉండాలి !

అదే విధంగా, మనిషి యొక్క మనస్సు ఎప్పడూ హాయిగా, ఆనందంగా ఉండాలి; ఇంకా ముందుకుపోతే... మనిషి యొక్క బుద్ధి ఎప్పడూ సునిశితంగా, సదా సత్యాన్ని చూపేదిగా ఉండాలి !

ఎప్పడైతే బుద్ధి సత్యాన్ని చూపించేదిగా ఉండదో, అప్పడు మనస్సు మలమై, అశుభ్రమై అనేక రుగ్మతలను కలిగి ఉంటుంది ! ఎప్పడైతే మనస్సు మలమై, అశుభ్రమై ఉంటుందో, అప్పడు శరీరం అస్వస్థతలకు లోనై, రోగాలకు మూలమై మనకు ఎన్నో దుఃఖాలను కలిగిస్తుంది.

## " దుఃఖాల నుంచి విడుదలే ముక్తి ! "

రకరకాల దుఃఖాల నుంచి విడుదల కావడమే " ముక్తి " అంటే !

శారీరక పరమైన రోగాల నుంచి " ముక్తి ", " విడుదల " !

మానసిక పరమైన రుగ్మతలు, ఒత్తిడులు, ఆందోళనలు, భయాల నుంచి " ముక్తి ", " విడుదల " !

అలాగే " బుద్ధి " యొక్క "మాంద్యం " నుంచి " ముక్తి ", " విడుదల " !

" అసలు నేనెందుకు పుట్టాను ?"

" ఈ జీవితం అంటే ఏమిటి ? "

ఇలాంటివన్నీ మనకు ఏ మాత్రం తెలియవు !

మన సాధారణ బుద్ధికి అందవు ! సత్యం అన్నది బుద్ధికి అందనప్పుడు మనకు మన జీవితం సొంతం అగమ్యగోచరంగా ఉంటుంది ! కనుక...

బుద్ధిపరమైన మాంద్యం పోవాలి.

మానసిక పరమైన రుగ్మతలు పోవాలి.

శారీరక పరమైన అస్వస్థతలన్నీ పోవాలి.

ఇవన్నీ శాశ్వతంగా పోవాలి!

ఒకప్పుడు పోయి మరొకప్పుడు ఉంటే అప్పుడు, అక్కడ, దానిని **ముక్తి వచ్చింది** అనం !

ఎప్పుడైతే ఈ మూడూ ...తనువు, మనస్సు మరి బుద్ధి... కూడానూ పరిశుభ్రమైపోతాయో.... శాశ్వతంగా... అప్పుడు " మనకు ముక్తి వచ్చింది " అంటాం. అంతవరకు ముక్తి రాలేదు. అంటే దుఃఖంలో కొట్టుకుంటున్నాం.

**మూడు రకాల దుఃఖాల నుంచి విడుదల !**

కపిల మహాముని ఏమన్నాడంటే...

**త్రివిధ దుఃఖ అత్యంత నివృత్తిః అత్యంత పురుషార్థః**

కామ, అర్థ, ధర్మ మరి మోక్షాలలో నాల్గవ పురుషార్థమైన మోక్షం అన్నది ఏమిటయ్యా అంటే మూడు రకాల దుఃఖాల నుంచీ పూర్తిగా విడుదల కావటమే.

దీనినే శ్రీకృష్ణుడు భగవద్గీతలో ఏమన్నాడంటే... " తమోగుణం నుంచి ముక్తిని పొందు ! రజోగుణం నుంచి కూడా ముక్తి పొందు ! సాత్వికగుణం నుంచి కూడా ముక్తి పొందు ! నిర్గుణుడివికా ! "

**త్రైగుణ్య విషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున !**

"నువ్వు మూడు గుణాలతో కలిసి ఉన్నావు; గుణాతీతుడవుకా ! ఓ అర్జునా !"

ఈ మూడు గుణాల నుంచి విముక్తుడవుకా !

శారీరక పరమైన రుగ్మతలే మరి తమోగుణ దోషాలు !

మానసికపరమైన రుగ్మతలే రజోగుణ దోషాలు !

బుద్ధి పరమైన రుగ్మతలే సాత్వికగుణ దోషాలు !

ఈ మూడు వెరసి సకల దుఃఖాలనూ కలిగిస్తాయి !

ఎప్పుడైతే ఈ దోషాలన్నీ తొలగిపోతాయో... అప్పుడు ... మనకు దుఃఖాలు ఉండవు !

అప్పుడు... మనం త్రిగుణాతీతులం అవుతాం !... అప్పుడు... దుఃఖరాహిత్యం వస్తుంది ! ముక్తి పొందుతాం !

## " ఎప్పుడూ కూడానూ దుఃఖం ఉండకూడదు ! "

మనిషికి ఎప్పుడూ కూడాను దుఃఖం ఉండకూడదు.

శారీరక పరంగా కానీ, మానసిక పరంగా కానీ, బుద్ధి పరంగా కానీ.

శారీరక పరంగా... అంటే తలనొప్పి నుంచి క్యాన్సర్ వరకు ఏ రోగాలూ రాకూడదు.

మానసిక పరమైన రుగ్మతలు... అంటే M.B.B.S. సీటు రాకపోతే ఆత్మహత్య చేసుకోవడం, ఎవరైనా అవమానిస్తే కృంగిపోవడం, B.P. లు తెచ్చుకోవడం. ఇలాంటివన్నీ కూడాను ఉండకూడదు !

బుద్ధి మాంద్యత ఉండకూడదు !

అంటే ఏకాగ్రతా శక్తి కలిగి ఉండాలి !

అంటే జ్ఞాపకశక్తి బాగా ఉండాలి !

మన గత జన్మలన్నీ మనం తెలుసుకోవాలి ! అంతవరకు మనకు జ్ఞాపకశక్తి ఉండాలి. అదే ముక్తి !

# " ముక్తి - మోక్షం - అపవర్గం - నిఃశ్రేయస్సు ! "

**ముక్తి** అన్నా, **మోక్షం** అన్నా, **అపవర్గం** అన్నా **నిఃశ్రేయస్సు** అన్నా పర్యాయపదాలని చెప్పకున్నాం. దీనికి జీసస్ క్రైస్ట్ ఏమన్నాడంటే...

**దేవుని రాజ్యం వెతకండి; ఆ యొక్క ధర్మంలో జీవించండి; అప్పుడు మీకు కావలసినవన్నీ వస్తాయి.**

" మీకు కావలసినవన్నీ " అంటే మనకు దుఃఖరాహిత్యం కావాలి. మన శరీరం చక్కగా ఉండాలి. మన మనస్సు ఎప్పడూ స్వచ్ఛంగా, ఏకంగా హాయిగా ఉండాలి. మన బుద్ధి ఎప్పడూ సునిశితంగా ఉండాలి. ఇవన్నీ మనకు కావాలి. " మీకు కావలసినవన్నీ వస్తాయి " అన్నాడన్న మాట !

కనుక **ముక్తి** అంటే ఈ మూడు రకాల రుగ్మతల నుంచి విముక్తి పొందడం ! దూరం కావడం ! అవి లేకుండా పోవడం శాశ్వతంగా !

ఈ రోజు **ముక్తి** అనే పదం ఒక్కటే కాకుండా మరో రెండు పదాలను తెలుసుకుందాం.

**పరి ముక్తి** **మహా పరి ముక్తి**

# " నిర్వాణం - పరినిర్వాణం - మహాపరినిర్వాణం ! "

వీటినే గౌతమ బుద్ధుడు పరినిర్వాణం. మహాపరినిర్వాణం అన్నాడు.

**నిర్వాణం అంటే దుఃఖరాహిత్యం**

**పరినిర్వాణం అంటే గొప్ప దుఃఖరాహిత్యం**

**మహాపరినిర్వాణం అంటే అత్యంత గొప్పదైన దుఃఖరాహిత్యం**

కనుక... నిర్వాణం, పరినిర్వాణం, మహాపరినిర్వాణం; అథవా ముక్తి, పరిముక్తి, మహాపరిముక్తి... ఈ మూడింటి గురించి మనం విశేషంగా విస్తారంగా తెలుసుకుందాం.

మనం మన స్వంత జీవితంలో శారీరక పరమైన దుఃఖాలు ఏవీ లేకుండా, మానసిక పరమైన దుఃఖాలు ఏవీ లేకుండా, బుద్ధి పరమైన అస్పష్టతలు ఏవీ లేకుండా ఉంటేనే మనం ముక్తి పొందినట్లు, మనం నిర్వాణం పొందినట్లు!

మనం నిర్వాణం పొందినా కూడానూ మన చుట్టు ప్రక్కల వాళ్ళు దుఃఖిస్తూ ఉంటే మనకు ఎంతమాత్రం బాగుండదు కదూ ! అలా ఉన్నప్పుడు ఆ చుట్టుప్రక్కల వాళ్ళ దుఃఖం, మన దుఃఖంగా పరిణమిస్తుంది. కనుక చుట్టుప్రక్కల వాళ్ళ దుఃఖరాహిత్యం కోసమూ పనిచేయడం అన్నదే **పరినిర్వాణం** అనబడుతుంది ; **పరిముక్తి** అనబడుతుంది. కేవలం మన చుట్టు ప్రక్కల వాళ్ళే కాకుండా "ప్రపంచం మొత్తంలో కూడాను దుఃఖాన్ని తీసివేసేయాలి " అని ఎవరైతే కంకణం కట్టుకుంటారో వారు **మహాపరి నిర్వాణం** లో ఉన్నట్టు : **మహా పరిముక్తి** లో ఉన్నట్టు.

## " ప్రపంచం మొత్తంలో దుఃఖం పోవాలి ! "

ప్రపంచ దుఃఖం వారి దుఃఖం కనుక... వారి దుఃఖం నుంచి సుదూరంగా పోవాలంటే... ప్రపంచంలోని మొత్తం దుఃఖం అంతా పోవాలి ! అప్పుడే వారి దుఃఖం పోతుంది !

కనుక, వ్యక్తి పరంగా మన నుంచి దుఃఖం పోతే **ముక్తి** ; మన చుట్టుప్రక్కల వారి దుఃఖం పోతే మనకు **పరి ముక్తి.**

ప్రపంచంలోని దుఃఖం అంతా తొలిగిపోతే అప్పుడు మనకు **మహాపరిముక్తి.**

స్వంతానికి తెలుసుకున్న తరువాత ఇక అందరికీ తెలియచెప్పే ధర్మం ఒకటుంటుంది : దానినే "తీర్థంకర గోత్ర బంధం " అంటాం.

**తీర్థంకరుడు** అంటే టీచర్.

ఆ టీచర్‌కు టీచింగ్ చేయకపోతే దుఃఖం వస్తుంది. కనుక, తన దుఃఖం పోవడం కోసం ' బోధన ' చేస్తాడన్నమాట. బోధన చేస్తే ఇక్కడ దుఃఖం పోతుంది.

కొంత మందికే బోధన చేయకుండా ప్రపంచానికి అంతటికీ నిరంతరంగా, ఎవడైతే ఎప్పుడూ బోధన చేస్తాడో అతడు తన మహాపరి దుఃఖం నుంచి తొలగిపోతాడన్నమాట. మహాపరినిర్వాణం పొందుతాడు.

దుఃఖం అన్నది మూడు స్థాయిలలో ఉంటుంది.

దుఃఖం ; పరి దుఃఖం ; మహాపరిదుఃఖం.

దుఃఖం నుండి విడుదలే ముక్తి.

కనుక ముక్తి కూడా మూడు రకాలు.

ముక్తి ; పరిముక్తి ; మహాపరిముక్తి.

నిర్వాణం, పరినిర్వాణం, మహాపరినిర్వాణం.

ఎవరి రోగాల నుంచి, ఎవరి మానసిక దుర్గతల నుంచి, బుద్ధి మాంద్యాల నుంచి వారు తొలగి పోయినప్పుడు వారికి " ముక్తి ".

చుట్టుప్రక్కల ఉన్నవారికి సహాయ పడుతున్నప్పుడు వారు వారి దుఃఖాల నుంచి దూరం కావడం. అప్పుడు ' పరిముక్తి ' !

ప్రపంచాన్నంతా కూడానూ ముక్తి మార్గంలో ప్రవేశింప చేసేటప్పుడు ఆ యొక్క శ్రమలో మనం నిమగ్నమయినప్పుడు, మనకు " మహాపరి నిర్వాణం " వస్తుంది ; **మహాపరిముక్తి** వస్తుంది.

మొట్టమొదటగా దుఃఖం నుంచి మనం విముక్తులం అయినప్పుడు మనం ' అరిహంత్ ' అవుతాం.

'అరి' అంటే 'శత్రువు'.

'హంత్' అంటే 'హతమార్చినవాడు'.

మనలోని శత్రువులను హతమార్చుకున్నాం.

మనలోని 'తమోగుణం' అంటే సోమరితనాన్ని హతమార్చాలి !

మామూలుగా మనం అనుకుంటామే ... కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే అరిషడ్ వర్గాలను మనం జయించినప్పుడు... మనం మనలోని ' రజోగుణాన్ని ' హతం చేసినప్పుడు, సాత్వికగుణాన్నీ అధిగమించి నప్పుడు మనం ' అరిహంతు ' ల మవుతున్నాం.

మనం ఏది సాధించామో, దేని నుంచి ముక్తి పొందామో దానినే మన చుట్టుప్రక్కల వాళ్ళందరిలో కొంత మందికైనా ఇవ్వడానికి ప్రయత్నిస్తూంటే మనకు **పరినిర్వాణం** !

సర్వ ప్రపంచానికీ బాధ్యత వహించినప్పుడు మహాపరినిర్వాణం. మనిషి " మహాపరినిర్వాణం " పొందే వరకు జన్మలు ఎత్తుతూనే ఉంటాడు.

" మహాపరినిర్వాణం " పొందినప్పడే జన్మరాహిత్యం వస్తుంది !

**ముక్తి** పొందినవాడు **అరిహంత్**

**పరిముక్తి**, పొందినవాడు **బోధిసత్వుడు**

**మహా పరిముక్తి, మహా పరినిర్వాణం** పొందినవాడు **బుద్ధుడు.**

**అరిహంత్, బోధిసత్వుడు, బుద్ధుడు, అరిహంత్** అంటే తనలోని శత్రువులను చంపుకున్నవాడు ; తాను స్వయంగా గుణాతీతుడైనవాడు.

" బోధిసత్వుడు " అంటే కొంతమందికి ఆ మార్గంలో ప్రబోధం చేసేవాడు. తన చుట్టుప్రక్కల ఉన్న కొంతమందిని చక్కగా ముక్తి మార్గం గురించి చెప్పి సాధన చేయించేవాడు.

ప్రపంచాన్నంతటినీ దృష్టిలో పెట్టుకుని, ప్రపంచాన్నంతటికీ గురువుగా అయి, ప్రపంచాన్నంతటికీ మార్గదర్శం చేయిస్తూ ప్రతి నిమిషం అందరి కోసం మరి పాటుపడే వాడు, అందరి దుఃఖ రాహిత్యాన్నీ కోరుకునేవాడు **బుద్ధుడు**. " మహాపరిముక్త స్థితి ". ' పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మాస్టర్లు ' అందరూ కూడానూ బుద్ధుళ్ళు ! అంటే వారు కేవలం తాము స్వంతంగా **దుఃఖరాహిత్యం** పొందాలని కోరుకున్న వాళ్ళు మాత్రమే కాదు. సర్వుల దుఃఖ రాహిత్యం కోసం పాటుపడేవారు.

# " సాధనే ముక్తి మార్గం ! "

ధ్యాన సాధన వల్లనే నిర్వాణం వస్తుంది.

ధ్యాన సాధన మాత్రమే కాకుండా, మరి **స్వాధ్యాయ సాధన** అని కూడా ఉంది ఎన్నో పుస్తకాలు చదవాలి మరి !

ఆత్మజ్ఞాన శాస్త్రంలో, ఆధ్యాత్మిక శాస్త్రంలో, ఎన్నో పుస్తకాలు, గ్రంథాలు, ఎంతోమంది విజ్ఞానుల, శాస్త్రజ్ఞుల, ఆధ్యాత్మిక శాస్త్రజ్ఞుల ద్వారా రచింప బడ్డాయి.

వేదవ్యాసుడు, వాల్మీకి, ఓషో, లోబ్‌సాంగ్ రాంపా, అనీబిసెంట్ ఇలాగే ఎంతో మంది యోగానంద పరమహంస, స్వామీ రామా... వీరందరూ కూడానూ ఆధ్యాత్మిక శాస్త్రజ్ఞులు, వారి పుస్తకాలు చదవడం అన్నదే జ్ఞాన సాధన ! అలాగే మూడవది... పిరమిడ్ మాస్టర్లు అందరూ కూడానూ ఎంతో గొప్ప ధ్యాన, జ్ఞాన... సాధన చేసినవారు. వారి వారి ధ్యాన, జ్ఞాన అనుభవాలు వినడం అంటే సజ్జన సాంగత్యం చేయడం. ఇది **సజ్జన సాంగత్య సాధన.**

# " మూడు రకాల సాధనలు ! "

**ధ్యాన సాధన, స్వాధ్యాయ సాధన, సజ్జన సాంగత్య సాధన,** ఈ మూడు రకాల సాధనలే ముక్తి మార్గాలు.

ఈ మూడు సాధనలూ చేపట్టినప్పుడు మనం ఎలా మాట్లాడాలి? ఎలా తినాలి ? ఎంత వరకు నిద్రపోవాలి ? ఎంత వరకు నిద్రపో కూడదు ? ఎలా ఆలోచించకూడదు ? ఎలా ఆలోచించాలి ? ఎలాంటి బట్టలు వేసుకోవాలి ? ఎలాంటి బట్టలు వేసుకోకూడదు ? కుటుంబంలో ఎలా జీవించాలి ? కుటుంబంలో ఎలా జీవించకూడదు ?...

ఇలాంటి అనేక విషయాల్లో సహజంగానే పట్టువస్తుంది. సహజంగానే అన్ని విషయాలూ తెలుస్తాయి. అప్పడు అన్ని విషయాల పట్ల సత్యం, ధర్మం ఏం చెప్తామో ఆ ప్రకారంగానే నడుచుకుంటాం !

సహజంగానే ముక్తిస్థితి వచ్చేస్తుంది! ముక్తి సాధనలు చేపట్టాలి.

ఏ సాధనలు ??

- ధ్యాన సాధన
- స్వాధ్యాయ సాధన
- సజ్జన సాంగత్య సాధన

సాధనా మార్గమే ముక్తి మార్గం.

సాధన చేస్తేనే ముక్తి వస్తుంది.

సాధనే ముక్తి మార్గం

ఈ మూడు రకాల సాధనల వల్లనే మన శరీరరుగ్మతలు మొత్తంగా లేకుండా పోతాయి. తలనొప్పి దగ్గర నుండి క్యాన్సర్ వరకు ఏ రోగాలూ రావు. అన్ని రోగాల నుంచి విముక్తి పొందుతాం మనం. ఎప్పటికీ ఇక రోగాలు రావు.

రోగాలకు కారణం అపరిశుభ్రమైన నాడీమండల వ్యవస్థే ! " నాడీ మండల వ్యవస్థ " అంటే అది మనకు గతజన్మల నుంచి వచ్చింది.

**"పూర్వజన్మ కృతం పాపం వ్యాధి రూపేణ పీడ్యతే !"**

ఆ సకల పాపాలు మరి ప్రక్షాళనం అయిపోతాయి ధ్యానంలో ! అప్పుడు శరీర రుగ్మతలు ఏవీ ఉండవు. మానసిక రుగ్మతలు అస్సలు ఉండవు. మానం అయినా, అవమానం అయినా సమానంగా తీసుకుంటాం. అదే మానసిక రుగ్మతల నుండి బయటపడటం !

ఇక బుద్ధి సంగతి అంటామా... మన జన్మలన్నీ, మన గత జన్మలన్నీ తెలుసుకుంటాం కనుక బుద్ధి చక్కగా పనిచేస్తుంది !

ఒక జన్మ గురించి ఆలోచించటమే బుద్ధిలేనితనం.

అనేక జన్మ పరంపరల పరిధిలో ఆలోచించటమే, ఆ విధంగా **సత్యాన్ని** తెలుసుకోవడమే **జ్ఞానం** అంటాం; **బుద్ధి కలిగి ఉండడం** అంటాం.

సజ్జన సాంగత్యం చేయడం ద్వారా ఏం తెలుస్తుంది అంటే "మనమే కాదు ఎంతోమంది మనకన్నా గొప్పవాళ్ళు ఉన్నారు " అని ! అప్పుడు ఎప్పుడూ **వినమ్రత** తో ఉంటాం. అదే మరి 'ముక్తి' అంటే. లేకపోతే 'గర్వం' వచ్చేస్తుంది.

కనుక, పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మాస్టర్లు అందరిచేతా, కనబడిన ప్రతి ఒక్కరి చేతా ధ్యాన సాధన చేయిస్తూ ఉంటారు.

స్వాధ్యాయ సాధన చేయిస్తూ ఉంటారు. సజ్జన సాంగత్య సాధన చేయిస్తూ ఉంటారు. కనుక తాము **మహాపరినిర్వాణంలో** ఉంటారు. తామొక **బుద్ధ** స్థితిలో ఉంటారు. తామొక **మహాపరిముక్త** స్థితిలో ఉంటారు. ఎవరైతే **మహాపరిముక్త** స్థితిలో ఉంటారో వారు మళ్ళీ జన్మించరు. మళ్ళీ పుట్టవలసిన అవసరం ఉండదు.

బోధిసత్త్వుడుగా చనిపోయినా మళ్ళీ మళ్ళీ పుట్టవలసి ఉంటుంది... బుద్ధుడుగా జన్మించేందుకు... ఆ స్థితికి ఎదిగేందుకు.

## " బుద్ధ స్థితిలోనే తుది శ్వాస ! "

ఎవరైతే బుద్ధ స్థితి పొంది, ఆ స్థితిలో జీవిస్తూ తుది శ్వాసను వదిలి పెడ్తారో వాళ్ళకు ఆ జన్మే ఆఖరి జన్మ... మళ్ళీ వారు పుట్టవలసిన అవసరం లేదు.

' బుద్ధస్థితి ' అంటే అదే జీసస్ స్థితి ; అదే శ్రీకృష్ణ స్థితి ; అదే మహావీరుడి యొక్క స్థితి ; అదే ఒక జొరాస్టర్ స్థితి. కాబట్టి ఆ స్థితిని మనం పొందినప్పుడు ఇక మళ్ళీ పుట్టనవసరం లేదు. ' జన్మరాహిత్య స్థితి ' అన్నమాట.

- అరిహంత్ స్థితి అంటే దుఃఖరాహిత్య స్థితి !
- బుద్ధ స్థితి అంటే జన్మరాహిత్య స్థితి !

మొట్టమొదట్లో మనం దుఃఖరాహిత్య స్థితి పొంది, ఆ తరువాత క్రమక్రమంగా మరి ప్రపంచాన్నంతా ఆ దుఃఖరాహిత్య స్థితి వచ్చేందుకు మనం కృషి చేస్తున్నప్పుడు మనకు జన్మరాహిత్య స్థితి వస్తుంది.

## " ఇప్పటికే ఎన్నో జన్మలు ఎత్తాం "

ఇప్పటికే ఎన్నోసార్లు పుట్టాం, చచ్చాం, ఎన్నో జన్మలు ఎత్తాం. భగవద్గీతలో కృష్ణుడు అంటాడు.

**"బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున !**
**తాన్యహం వేద సర్వాణి నత్వం వేత్థ పరంతప ॥"**

అర్జునా ! నువ్వూ - నేనూ ఎన్నో జన్మలు ఎత్తాం! నాకు నా జన్మలు, నీ జన్మలు అన్నీ తెలుసు! నీకు ఏమీ తెలియదు!

కనుక,

**జన్మపరంపరా జ్ఞానమే... ముక్తి !**
**నేను దేహం కాదు ' ఆత్మ ' అని తెలుసుకోవడమే... ' ముక్తి ' !**
**దుఃఖరాహిత్యం కలిగి ఉండడమే.. ముక్తి !**

**నా వాస్తవానికి నేను సృష్టికర్తను, పరుల వాస్తవానికి పరులే సృష్టికర్తలు** అనే కర్మ సిద్ధాంతం గురించి అనుభవ పూర్వకంగా, సంపూర్ణంగా తెలుసుకుని ఉండడమే... ముక్త స్థితి.

ఈ **ముక్త స్థితి** ప్రార్థన ద్వారా రాదు. భజనల ద్వారా రాదు. తీర్థయాత్రల ద్వారా రాదు. గురువు పాదాలు పిసకడం ద్వారా రాదు. మంత్రోచ్చారణ ద్వారా రాదు.

ముక్త స్థితి అన్నది ఆత్మానుభవం ద్వారా పొందాలి. స్థూల శరీరం లోంచి బయటకు వచ్చి సూక్ష్మ శరీరంలో విహరించాలి! సూక్ష్మ శరీరం లోంచి బయటకు వచ్చి కారణ శరీరంలో విహరించాలి... కారణ లోకాలలో కారణ శరీరం లోంచి బయటకు వచ్చి... మహాకారణ

లోకాలలో మహాకారణ శరీరంతో విహరించాలి ! అప్పుడు సృష్టి యొక్క పూర్ణరూపం మనకు అవగతమవుతుంది. అనుభవ పూర్వకంగా ! అదీ ముక్త స్థితి అంటే...! **నేను కేవలం స్థూలశరీరం** అని అనుకున్నప్పుడు అది బంధ స్థితి, ముక్త స్థితి కాదు !

## "ఒకరు ఇంకొకరిని కాపాడరు !"

**నన్ను ఎవరో పుట్టించారు ! ఎవరో కాపాడుతారు ! ఎవరో మార్గం చూపిస్తారు** అని అనుకున్నప్పుడు అది బంధ స్థితి. ముక్త స్థితి కాదు !

నా యొక్క స్థితికి తల్లిదండ్రులు కారణం ! దేవుడు కారణం ! మరి సంఘం కారణం అని అనుకున్నప్పుడు అది బంధ స్థితే ముక్త స్థితి కాదు.

నా స్థితికి నేనే కారకుడను అని ఎవరైతే తెలుసుకుంటారో వాళ్ళు ముక్త స్థితి పొందినవారు. పరుల మీద జాలి పడేవాడు బంధ స్థితిలో ఉన్నవాడు, ముక్త స్థితిలో లేనివాడు. పరుల మీద జాలి పడకూడదు, వారికి ఏం కావాలో అది ఇవ్వడంలో నిమగ్నం కావాలి. వారికి ధ్యానం కావాలి. వారి చేత ధ్యాన సాధన చేయించాలి. జాలిపడితే ఏం లాభం ? ముక్త స్థితిలో ఉన్నవారు జాలి పడకూడదు.

తమ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ ఉండాలి !

## " జాలిపడితే సమయం వృధా ! "

జాలి పడడం అనేది ఆ యొక్క సమయాన్ని వృధా చేసుకున్నట్టు. ఒక్క క్షణమైనా జీవితాన్ని వృధా చేసేవాడు, బంధ స్థితిలోనే ఉన్నట్టు ; ముక్త స్థితిలో ఉన్నట్టు కాదు.

ఎవరైతే ముక్త స్థితిలో ఉంటారో వాళ్ళు జాలి పడడం ద్వారా సమయాన్ని ఎప్పుడూ వృధా చేయరు. ఎప్పుడూ కష్టపడుతూంటారు. లేకపోతే విశ్రాంతి తీసుకుంటారు లేకపోతే హాయిగా ఆనందంగా జీవిస్తూ ఉంటారు. అంతేగాని దుఃఖిస్తూ ఉండరు. జాలిపడుతూ ఉండరు. జాలి లేకపోవడం అన్నదే కార్లోస్ కాస్టనెడా 'ruthlessness' అన్నాడు..... 'no pity state' అన్నమాట ! అవతల వారిమీద జాలిపడే బదులు ఆ సమయంలో " కళ్ళు మూసుకోవోయి ! ' శ్వాస మీద ధ్యాస ' పెట్టవోయి ! నీ ' చిత్తాన్ని నివృత్తి ' చేసుకోవోయి ! ఊరికే ఎందుకు ఆలోచిస్తావు ? ఈ పుస్తకం తీసుకో ! ఇది చదువు ! అక్కడికి వెళ్ళి పిరమిడ్‌లో కూర్చో ! బాగా నీకు పిరమిడ్ శక్తి వస్తుంది " అని... వాళ్ళచేత సరైన సాధన చేయించాలే గాని " అయ్యో ! నీకు ఇలా అయిందా ! అలా అయిందా ! అలా కాకూడదే " అని... ఇలాంటి మాటలు మాట్లాడేవాడు ముక్త స్థితిలో బొత్తిగా లేనివాడు.

## " నోటిలోని మాటే నుదిటి మీద వ్రాత ! "

నోట్లోంచి ఒక్క వాక్యమైనా అపరిపక్వంగా వచ్చినప్పుడు వాడికి ముక్త స్థితి లేదన్నమాట. అందుకే జీసస్ క్రైస్ట్ అన్నాడు. " What goes into the mouth that does not defileth the person...! What comes out of the mouth that defileth the person.

అంటే.

" నోట్లోకి ఏది పోతుందో.... ఆలుగడ్డ పోతోందో, వంకాయ పోతోందో... అది కాదు నాయనా, నోట్లోంచి ఏది బయటకు వస్తుందో దాని గురించి జాగ్రత్తగా ఉండు. అది నిన్ను బంధ పరిస్థితిలో ఉంచవచ్చు లేదా ముక్త పరిస్థితిలో ఉంచవచ్చు" అన్నాడు. కనుక మన నోట్లోంచి ఎప్పుడూ కూడానూ పనికిరాని మాటలు, అశాస్త్రీయమైన మాటలు, అసంగతమైన మాటలు, అసందర్భమైన మాటలు, నెగెటివ్ మాటలు, పనికిరాని జాలి మాటలు ... ఇవన్నీ ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదు.

చక్కగా ఎప్పుడూ అందరికీ పనికివచ్చే మాటలే. శాస్త్రీయమైన మాటలే, సైంటిఫిక్ మాటలే, పాజిటివ్ మాటలే ఎప్పుడూ రావాలి ... అప్పుడే మనం ముక్త స్థితిలో ఉన్నట్లు.

అలాగే, ఇంకెవరైనా పనికిరాని మాటలు మాట్లాడుతున్నప్పుడు వాళ్ళను ఎదిరించాలి. సంఘంలో ఉండే కుళ్ళును ఎదిరించని వాడు **ముక్త** స్థితిలో లేనివాడు. **వాడు ఎలాగుంటే నాకు ఏమిటి ?** అని అనుకుంటే ముక్త స్థితిలో ఉన్నవాడి లక్షణం కాదు. తనకు తాను ముక్తిని పొంద వచ్చును. కానీ, ' పరిముక్తి ' లేదు వాడికి. ' మహా పరిముక్తి ' అంత కన్నా లేదు. మరి ' పరిముక్తి ', ' మహాపరిముక్తి ' పొందేవరకు జన్మలు తీసుకుంటూనే ఉంటారు.

## " సంఘంలోని కుళ్ళును ఎదిరించాలి ! "

ఎప్పుడూ కుళ్ళును ఎదిరించాలి ! ఎవరైనా పనికి రాకుండా మాట్లాడితే "ఎందుకలా మాట్లాడుతున్నావు ? నోర్మూసుకుని కూర్చో ! మౌనంగా ఉండు ! ధ్యానంలో ఉండు " అని చెప్పాలి. పనికిరాని

పనులు చేస్తూంటే, మాంసం తింటూంటే **మాంసం తినవద్దు. శాకాహారం తిను** అని చెప్పాలి.

చెప్పడం మన వంతు. వాడు చేస్తాడో, చేయడో అది వాడి యొక్క ఖర్మ, కానీ, మనం చెప్పకపోతే అది మన ఖర్మ అవుతుంది. కనుక, ఎప్పుడూ కూడాను సత్యపు మాటలు మాట్లాడేవాడే ముక్త స్థితిలో ఉండేవాడు.

ఎప్పుడూ కూడానూ ' సశాస్త్రీయంగా ' మాట్లాడాలి. ఉన్నది ఒక్కటే శాస్త్రం యొక్క పాయింట్... **ఎవరి వాస్తవాన్ని వాళ్ళే సృష్టించుకుంటూ ఉన్నారు** అని ! ఎవరైనా, ఏదైనా సహాయం కోరితే మనం ఎలాంటి సహాయం ఇవ్వాలి ? వారిని నెత్తిన పెట్టుకోకూడదు ! వాడి యొక్క హోమ్ వర్క్ చేయకూడదు ! వారి హోమ్‌వర్క్ వారు చేసుకునేలా సరైన సూచన ఇవ్వాలి. అంతేకానీ వారిని నెత్తి మీద పెట్టుకోకూడదు. అది **పనికిరాని మంచితనం**... అది సాత్విక గుణ దోషం.

## " బద్ధకం ఉండకూడదు ! "

తమోగుణం అంటే బద్ధకం. బద్ధకం ఉన్నవాడు బంధ స్థితిలో ఉన్నవాడు. ఎప్పుడూ మనకు బద్ధకం ఉండకూడదు. చకచకా లేవాలి. చకచకా మాట్లాడాలి. చకచకా పనులు చేసుకోవాలి. ఇదే తమోగుణ దోషం నుండి ' ముక్తి ' పొందడం అంటే !

అలాగే రజోగుణ దోషం అంటే అహంకారం. **నేనే గొప్పవాడిని ! నా మాటే అందరూ వినాలి !** ...ఇది రజోగుణం అన్నమాట. " నేను చెప్పినట్లే అందరూ వినాలి ", ఇలా ఉన్నవాడు హతుడై ఉన్నవాడు. బంధంతో

ఉన్నవాడు. ముక్తుడు కాదు కదా ! ఎవరి ఇష్టాయిష్టాలు వాళ్ళవి ! ముఖ్యంగా తల్లిండ్రులు పిల్లలను శాసిస్తూ ఉంటారు. తమ ఇష్టాలను వాళ్ళ మీద రుద్దుతూ ఉంటారు ! ఇలాంటి తల్లిదండ్రులు బంధ స్థితిలో ఉన్నవారే గాని, ముక్త స్థితిలో లేనట్లు. అడ్డాలలో ఉన్నప్పుడే బిడ్డడు. కానీ గడ్డాలు వచ్చినప్పుడు బిడ్డడు కాడు ! కనుక, ఎదిగిన పిల్లలను వారి వారి ఇష్టాలకూ వదిలివేయడమే ముక్త స్థితి. " నా ఇష్టప్రకారం అందరూ మాట్లాడాలి ! అందరూ వినాలి ! అందరూ జీవించాలి ! " అంటే అది రజోగుణం యొక్క లక్షణం. అది రజోగుణ దోషం.

ఇకపోతే సాత్వికగుణ దోషం ! అంటే మనం జాలిపడి వారు చేయవలసిన పనులను, వారికి బదులు మనం చేస్తూంటాం. ఇది సాత్వికగుణ దోషం. ఇకపోతే వాళ్ళు ఏదన్నా చెడు పనులు చేస్తూంటే ఎదిరించకుండా ఉంటాం ! " మనకెందుకులే " అని చెప్పేసి ! ఇవన్నీ కూడానూ సాత్వికగుణ దోషాలు !

## " జ్ఞాన బోధ చేయాలి ! "

ఈ సాత్వికగుణ దోషాల నుండి కూడా మనం దూరం కావాలి. ఎప్పుడూ కూడానూ ఎదిరించాలి ! జ్ఞానబోధ చేయాలి ! సక్రమ మార్గం చూపిస్తూ ఉండాలి ! తన తలకాయ పోయినా సరే, మన ప్రాణ నష్టం జరిగినా సరే, మనకు సంఘంలో అవమానం, తలక్రిందులు, చిన్నచూపు దొరికినా సరే.

కనుక తమోగుణ దోషం నుంచి, సోమరితనం నుంచి, దూరం కావాలి. రజోగుణ దోషం నుంచి అంటే **అంతా నేనే, నాకే కావాలి** అనే ఆ యొక్క ధోరణి నుండి మనం దూరంగా ఉండాలి. తరువాత

అవసరమైన మంచి చేయకూడదు. కానీ మంచిని ప్రబోధించాలి. మంచిని చేయకూడదు. వాళ్ళ మంచి వాళ్ళు చేసుకోవాలి. ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి. మనం ఇంకొకరిని ఎలా ఉద్ధరిస్తాం ? నేను ఇంకొకరిని ఉద్ధరించడమనేది సాత్వికగుణ దోషం. ఎవరినీ ఎవరూ ఉద్ధరించలేరు.

**ఉద్ధరేదాత్మనాత్మానం ఆత్మానమవసాదయేత్ -**

**ఆత్మైవహ్యాత్మనో బంధుః ఆత్మైవ రిపురాత్మనః**

శ్రీకృష్ణుడు భగవద్గీతలో " ఎవరినివారే ఉద్ధరించుకోవాలి " అని చెప్పాడు. శ్రీకృష్ణుడు కౌరవులను ఉద్ధరించలేకపోయాడు ! ప్రయత్నం చేస్తాం కానీ, వారిని వారే ఉద్ధరించుకోవాలి. శ్రీకృష్ణుడు పాండవులను ఉద్ధరించలేదు. పాండవులు సాధన ద్వారా తమను తాము ఉద్ధరించుకున్నారు !

## " సాధన - పరిసాధన - మహాపరిసాధన ! "

' సాధన ' అనేది మూడు రకాలుగా ఉంటుంది. ఎలాగైతే ' ముక్తి ' అనేది మూడు రకాలుగా ఉందో ... అలాగే ముక్తి పొందే మార్గం కూడానూ అంటే సాధనా మార్గం కూడానూ మూడు రకాలుగా ఉంటుంది.

' సాధన ',

' పరిసాధన ',

'మహాపరిసాధన ',

మనం మూడు దోషాల నుండి అంటే తమో, రజో, సాత్విక దోషాల నుండి దూరం అయ్యేందుకు చేసే ఆ కృషి... సాధన.

ఆ సాధనలే **సాధనలు** అనబడతాయి. అలాగే ఇతరుల దుఃఖం నుండి వారిని విముక్తులను చేయడం కోసం చేసే సాధనే **పరి సాధన** అవుతుంది. **ప్రపంచం మొత్తం కూడానూ దుఃఖరాహిత్యం పొందాలి** అనే దానికోసం చేసే సాధనే **మహా పరిసాధన** అవుతుంది.

| | | |
|---|---|---|
| సాధన | పరిసాధన | మహాపరిసాధన |
| ముక్తి | పరిముక్తి | మహాపరిముక్తి |
| నిర్వాణం | పరినిర్వాణం | మహాపరినిర్వాణం |
| అరిహంత్ | బోధిసత్వుడు | బుద్ధుడు |

మనం ' సాధన ' తో మొదలై అది ' పరిసాధన ' తో మధ్యలో ఉండి, చివరకు ' మహా పరిసాధన 'తో మన జీవితం ముగించాలి !

మహాపరిసాధనలో నిమగ్నమై ఉండేవారే పిరమిడ్ మాస్టర్లు ! కనబడిన ప్రతివారికీ ధ్యానం ప్రబోధిస్తూ ఉంటారు. సజ్జన సాంగత్యం చేయమని చెప్తూంటారు. ట్రెక్కింగ్‌లకు వెళ్లమని చెప్తూంటారు. మాంసాహారం తినవద్దని చెప్తూంటారు. శాకాహారం కూడానూ మితాహారంగానే ఉండమని చెప్తూంటారు. పౌర్ణమి రోజుల్లో ధ్యానం చేయండని చెప్తారు. చిన్నపిల్లలకు చిన్నప్పటి నుంచే ధ్యానం చేయమని చెప్తారు. ధ్యాన ప్రశిక్షణల్లో డబ్బు తీసుకోవద్దని చెప్తారు. పిరమిడ్ శక్తిని ఉపయోగించమని చెప్తారు. కర్మకాండలు... వ్యర్థమైన కర్మకాండలు...చేయ వద్దంటారు.

... ఇలాగే ఎన్నో ఎన్నో వీరు కనబడిన ప్రతి మనిషికీ చెప్తూంటారు. ఇదే మహాపరిసాధన ! ఇదే బుద్ధత్వస్థితి ! ఎవరైతే ఈ స్థితిలో ఉంటారో వారికి ఖచ్చితంగా ఈ జన్మ ఆఖరి జన్మ !

# "చేయవలసినవి చేస్తే పొందవలసినవి పొందుతాం!"

పిరమిడ్ మాస్టర్లందరికీ ఈ వర్తమాన జన్మ ఆఖరి జన్మ ! మరి ఇంకా 18 ఆదర్శ సూత్రాలు. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీల 18 ఆదర్శ సూత్రాలే మరి ఈ యొక్క **మహాపరినిర్వాణానికి మహాపరి ముక్తికి** మనం చేయవలసిన **మహాపరిసాధన** !

చేయవలసినవి చేస్తే మనం పొందవలసినవి పొందుతాం. శారీరక రోగాలు ... వ్యాధులు అన్నీ మానసిక రుగ్మతలు మీదే ఆధారపడి ఉన్నాయి.

మానసిక రుగ్మతలన్నీ బుద్ధి యొక్క మాంద్యం మీదే. బుద్ధి యొక్క అస్వచ్ఛత మీదే ఆధారపడి ఉన్నాయి. ఎప్పుడైతే మనం ఆధ్యాత్మికతలో జీవిస్తామో, ఆధ్యాత్మికతలో ఉంటామో, 'బుద్ధి' అనేది దాని యొక్క మాంద్యం పోగొట్టుకుని అద్భుతమైన 'ఆత్మ' పదార్థంగా విరాజిల్లుతుంది ! అప్పుడు శరీరం ప్రశాంతంగా, నిర్మలంగా, స్వచ్ఛంగా ఉంటుంది.

ఇప్పటికీ హిమాలయాల్లో కొన్ని వందల మంది వేల సంవత్సరాలుగా సజీవంగా ఉన్నారు. మనకు ఇచ్ఛామరణం రావాలి. భీష్ముడు తన మరణాన్ని, మరణ సమయాన్ని తానే ఎంచుకున్నాడు. **నేను శరీరం వదలి పెట్టేస్తున్నాను, సుభాష్! నా కోసం సమాధి ఏర్పాటు చెయ్యి** అని 1983 వ సంవత్సరం ఏప్రిల్ 16 న నాకు చెప్పారు శ్రీ సదానందయోగి! చెప్పిన తేదీకి ఆయన శరీరాన్ని వదిలిపెట్టేశారు ! అదే పరిపక్వ ఆత్మస్థితి అంటే !

## " ఏ గూటి పక్షులు ఆ గూటికే ! "

ఒక బుద్ధస్థితిలో స్వయంగా ఉన్నాను నేను !

మరి ఏ గూటి పక్షులు ఆ గూటి వద్దకే చేరుతాయి కదా !

ఏ జాతి పక్షులు ఆ జాతిలోనే చేరుతాయి కదా !

పిరమిడ్ మాస్టర్లందరూ కూడానూ, పిరమిడ్ ధ్యానులందరూ కూడానూ... మరి 'బుద్ధస్థితి' లో ఉన్నవారే ! అందుకనే అందరూ కూడానూ ఇక్కడ ఏకత్రితమై ఉన్నాం !

ఎన్నో జన్మలుగా మనం ఎంతో సాధనలో, ఎంతో 'పరిసాధన'లో పక్వం అయి ఆ తరువాతే ఇక్కడ మనందరం కలిసి ఉన్నాం.

మన లక్ష్యమేమిటంటే అందరికీ ముక్తి రావాలి. అందరూ ధ్యానం చేస్తే ముక్తి పొందుతారు. ప్రతి రోజూ ఎవరెవరి వయస్సుకు తగినన్ని నిమిషాలు అంటే పది సంవత్సరాల వాళ్ళు పది నిమిషాలు, ఇరవై సంవత్సరాల వాళ్ళు ఇరవై నిమిషాలు, నలభై సంవత్సరాల వాళ్ళు నలభై నిమిషాలు .... ఈ విధంగా ... కళ్ళు రెండూ మూసుకుని **శ్వాస మీద ధ్యాస** ఉంచాలి. ' ఆనాపానసతి ' అభ్యాసం చేయాలి ! అదే ముక్తి మార్గానికి నాందీ ప్రస్తావన ! కళ్ళు రెండూ మూసుకుని " శ్వాస మీద ధ్యాస " ఉంచడం నేర్చుకోవాలి ! ఇదే ఏకైక ముక్తి మార్గం.

' ఓషో రజనీష్ ' పుస్తకాలు చదవాలి ! మాంసం తినకూడదు ! ఆకలి లేకుండా భోజనం చేయకూడదు ! నీరు విపరీతంగా త్రాగాలి ! ఎప్పుడూ సత్యాన్ని ప్రబోధిస్తూ ఉండాలి ! అసత్యాన్ని ఎదుర్కొంటూ ఉండాలి ! అదే **ముక్తి మార్గం.** ఎప్పుడూ కూడాను అందరి అనుభవాలు సదా వింటూ ఉండాలి !

మన అనుభవాలనూ అందరికీ సదా చెప్తూ ఉండాలి ! ఇదే సజ్జన సాంగత్యం అంటే ! ఇదే ముక్తి మార్గం ! ఒక్క నిమిషమైనా సమయాన్ని వృధా చేయకూడదు ! ప్రక్కవాళ్ళనీ వృధా చేయనివ్వ కూడదు ! వీళ్ళైనా ఉబుసుపోక కబుర్ల కోసం వస్తే " దయచేసి కబుర్లు వద్దు ! నేను సాధన చేసుకోవాలి ! మనమిద్దరం కలిసిసాధన చేద్దాం ! " అని చెప్పేసి మరి వారు ' కబుర్లు చెప్పనీయకుండా ' చెయ్యాలి !

## " చిన్నప్పటి నుంచే ! "

చిన్న పిల్లలకు చిన్నప్పటి నుంచే ధ్యానం చెప్తే వారు ముక్త స్థితిలో సహజంగానే పెరుగుతారు. బంధ స్థితిలో ఉండనే ఉండరు. రెండేళ్ళ వయస్సు నుంచే చిన్న పిల్లలకు ధ్యానం నేర్పించాలి. ఇవన్నీ కూడానూ పెద్దల బాధ్యతలు !

**పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్** లో ముక్తి మార్గాలే ఉన్నాయి ... ఇంకేమి లేవు ! ఇంకేమి మాట్లాడం మనం ! **ప్రకృతిలో జీవించడమే - ముక్తి మార్గం!**

చక్కగా పౌర్ణమి రోజుల్లో, నదీ తీరాలలో, సముద్ర తీరాలలో, కొండలలో, లోయలలో, అడవులలో ధ్యానం చేయాలి ! ప్రకృతితో సహ జీవనమే ముక్తి మార్గం కదా ! వర్షం పడుతూంటే చక్కగా వర్షంలో " నృత్యం " చేయాలి ! అంతేగానీ వర్షానికి భయపడి ఉంటామా ? భయ మనేదే ఒక బంధ మార్గం. భయరాహిత్యమనేది ముక్తి మార్గం. దేనికీ భయపడకూడదు. నిర్భయంగా ఉండాలి. మన ఆలోచనలను నిర్భయంగా ప్రకటించాలి. "పక్కవాళ్ళు ఏమైనా అనుకుంటారేమో ?" అని ఎప్పుడూ సత్యం మాట్లాడకుండా ఉండకూడదు. చెప్పవలసింది గట్టిగానో, మెల్లిగానో చెప్పే తీరాలి.

' ముక్తి ' అంటే విడుదల ! దీనికి పర్యాయపదాలు 'మోక్షం', 'అపవర్గం', 'నిఃశ్రేయస్సు', అలనాడు జీసస్ క్రైస్ట్ " సత్యం ఏమిటో తెలుసుకోండి. సత్యం మిమ్మల్ని బంధ విముక్తుల్ని చేస్తుంది " అన్నాడు.

**నేను ఆత్మను** అని తెలుసుకున్నవాడే ' సత్యం ' తెలుసుకున్న వాడు ! " నా కర్మలే నా వాస్తవాలు సృష్టిస్తున్నాయి ", అన్నది తెలుసుకున్నవాడే ' సత్యా'న్ని తెలుసుకున్నవాడు ! ఉన్నవి రెండే రెండు సత్యాలు.

1. " నేను ఆత్మను ! "

2. " నా వాస్తవానికి నేనే సృష్టికర్తను "

ఈ రెండూ రెండు మౌలిక సత్యాలు ! సత్యాలను దర్శించినవాడే ముక్తుడైన వాడు. బంధస్థితిని దాటిన వాడు.

## " ముక్తాభిమానీ ముక్తోహి ! "

ముక్తిని అభిమానించేవారు తప్పకుండా తప్పకుండా ముక్త పురుషులు అవుతారు.

**ముక్తాభిమానీ ముక్తో హి బద్ధో బద్ధాభిమాన్యపి**
**కిం వదంతీహసత్యేయం యా మతిః సా గతిర్భవేత్ "**

...అన్నాడు అష్టావక్రుడు !

**ముక్తాభిమానీ ముక్తో హి** అంటే ముక్తస్థితిని అభిమానించే వాడు ముక్తుడే అవుతాడు. ఎందుకు కాదు ? బంధాన్ని అభిమానించే వాడు బద్ధుడే అవుతాడు. ఈ లోకంలో ఉండే ఈ నానుడి " యా మతిః సా గతిర్భవేత్ ". మన మతి ఎలా ఉంటుందో మన గతి కూడా అలాగే

ఉంటుంది. ఆ మనకెందుకులే ! ముక్తి వచ్చేనా ? పోయెనా ? ఇప్పుడు కాదు ! ఎప్పుడో ముసలితనంలో చేసుకోవాలి అంటాం. ముసలితనం వస్తే ఇప్పుడు ఇంకేం చేస్తాం ? కాటికి కాలు చాపుకున్నాం ! చిన్నప్పుడే చేయాల్సింది ! ఇప్పుడేం లాభం ? "

చూశారా ? " ఈ రోజు, రేపు చేయాలి " అని అంటూ, " రేపు ఏమో ; నిన్న చేసి ఉండాల్సింది : ఇప్పుడు చేయలేం ! " అంటూ !

కనుక ఈ విషయాలన్నీ విన్న తక్షణమే సాధన చేపట్టాలి. శుభస్య శీఘ్రం ! ఆలస్యం అమృతం విషం !

చుట్టుప్రక్కల కొంతమంది అయినా దుఃఖరాహిత్యం పొందాలని కోరుకున్న వాళ్ళు కాదు ... ప్రతి పిరమిడ్ మాస్టర్ కూడానూ "ప్రపంచమంతా కూడా దుఃఖరాహిత్యస్థితి పొందాలి. ప్రతి పిల్లవాడు, ప్రతి పిల్లా, ప్రతి పాప, ప్రతి వృద్ధుడు, ప్రతి వృద్ధురాలు, ప్రతి స్త్రీ, ప్రతి పురుషుడు, అన్ని రాష్ట్రాల వారూ, అన్ని దేశాల వారూ అందరూ కూడానూ దుఃఖ రాహిత్య పదవి పొందాలి. అరిహంత పదవి పొందాలి ... " అన్న దానికి కష్టపడేవారే **పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మాస్టర్లు.**

**ముక్తికి మార్గం సాధన !**

**ధ్యాన సాధన !**

**స్వాధ్యాయ సాధన !!**

**సజ్జన సాంగత్య సాధన !!!**

మనం ధ్యానం చేయాలి.

మన మనస్సును ఏకీకృతం చేయాలి, నిర్మానుష్యం చేయాలి ; నిర్విషయం చేయాలి !

మనస్సును నిర్మానుష్యం చేసినప్పుడు - మనస్సును నిర్విషయం చేసినప్పుడు ... అద్భుతమైన దివ్య చక్షువు విరాజిల్లుతుంది ! దానితో మన సకల జన్మలూ చూసుకుంటాం. మనం జన్మలు చూసుకున్నప్పుడే నేను ఈ శరీరం కాదు ! ఆత్మను అని తెలుస్తుంది. అదే ముక్తిని పొందడం !

నేను దేహాన్ని అనే స్థితి నుండి **నేను ఆత్మను** అనే స్థితికి ఎదగడమే ముక్తిని పొందడం !

ఈ మాటలు విన్న వెంటనే సాధనలో ఉపక్రమించాలి.

**ధ్యాన సాధన ... !**

**స్వాధ్యాయసాధన ... !!**

**సజ్జన సాంగత్య సాధన ... !!!**

అప్పుడు అన్ని విషయాలూ తెలుస్తాయి ! తెలిస్తే వెంటనే మనస్సు లోని అజ్ఞానపు వికృత ఆలోచనలు పోతాయి ! జీవితంలోని అజ్ఞానపు వికృత చేష్టలు పోతాయి !

మనసా-వాచా-కర్మణా అరిహంత స్థితిని పొందుతాం. ముక్తి స్థితి పొందుతాం. మనం అరిహంత్ కాగానే మనం మన చుట్టుప్రక్కల వాళ్ళను కూడాను అరిహంత్‌లుగా చేయడానికి తప్పకుండా కృషి చేస్తాం ! అదే మన బోధిసత్వ స్థితి !

చుట్టుప్రక్కల వాళ్ళందరినీ ధ్యానులుగా చేస్తూండగా ప్రపంచా న్నంతటికీ కనపడిన ప్రతివాళ్ళకీ ధ్యానం చెప్పే స్థితికి ఎదుగుతాం ! అదే బుద్ధ స్థితి ! అదే మహాపరిముక్తి మార్గం.

**- బ్రహ్మర్షి పత్రీజీ**


ధ్యానలహరి ఫౌండేషన్